క్లుప్తంగా

ముగిసిన తిరుకల్యాణం


స్వామి వారిని ఊరేగిస్తున్న భక్తులు

తుక్కుగూడ: పుర పరిధి శ్రీనగర్(ఈ–సిటీ) శ్రీ ఆదిలక్ష్మి అలివేలు మంగ సమేత శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి తిరుకల్యాణోత్సవం శుక్రవారంతో ముగిసింది. ఉత్సవంలో భాగంగా స్వామి వారు మంఖాల్ నుంచి ఈ–సిటీ గుట్టకు చేరుకోవడం, కల్యాణం, రథోత్సవ తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం, తాగునీటి వసతి, సాంస్కృతిక కార్యక్రమాలను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్తలు శేషం జగన్నాథచార్యులు, శేషం సింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కె.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ గ్రీన్‌హిల్స్‌కాలనీ ఫీడర్ పరిధి కాలనీలలో మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు, 11కేవీ హుడాసాయినగర్, అష్టలక్ష్మి ఫీడర్ల పరిధి కాలనీల్లో మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

20న తైబజారు వేలం

ఆమనగల్లు: తై బజారు 2025–26 సంవత్సరానికి ఈ నెల 20న పుర కార్యాలయంలో వేలం పాట నిర్వహించనున్నామని మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.2.75 లక్షల విలువైన డీడీని ఏదైనా జాతీయ బ్యాంకులో తీసి, 19వ తేదీలోపు మున్సిపల్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. అలాగే కోడి వ్యర్థాల సేకరణ వేలంలో పాల్గొనే వారు రూ.25 వేల డీడీ అందించాలన్నారు. డీడీలు చెల్లించినవారు మాత్రమే వేలంలో పాల్గొనాలని, ప్రభుత్వ నిబంధనల మేరకే నిర్వహిస్తామని పేర్కొన్నారు.

స్పీకర్‌కు క్షమాపణ చెప్పాలి

ఆమనగల్లు: స్పీకర్ ప్రసాద్‌కుమార్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి వెంటనే క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు మండ్లి రాములు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. దళిత వ్యక్తి స్పీకర్‌గా ఉండటం సహించలేకే బీఆర్ఎస్ నేతలు దురహంకారాన్ని ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. స్పీకర్‌ను అవమానించేలా మాట్లాడిన ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి.. స్పీకర్‌కు, దళిత సమాజానికి వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆ పార్టీ నాయకులను ఎక్కడికక్కడ అడ్డుకుంటారని హెచ్చరించారు.

ఘనంగా బ్రహ్మోత్సవం

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం దేవునిపడకల్ గ్రామంలో వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు శుక్రవారం ఆలయ అర్చకులు రామాచార్యులు ఆధ్వర్యంలో ధ్వజారోహణం, భేరీపూజ, దేవతాహ్వాన హోమం, పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాడమోని శ్రీశైలం, నాయకులు శంకర్, రవి, యాదయ్య, శ్రీను, జంగయ్య, వెంకటయ్య, భక్తులు పాల్గొన్నారు.

శబరిమలకు చేరిన గోరక్షక యాత్ర


పాదయాత్ర బృందం

అబ్దుల్లాపూర్‌మెట్: గోవుల సంరక్షణకు కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు చేపట్టిన 'గోరక్షక మహా పాదయాత్ర' శుక్రవారం శబరిమల కొండకు చేరిందని గురుస్వామి బాలకృష్ణ తెలిపారు. సెప్టెంబర్ 27న కశ్మీర్‌లోని లాల్‌చౌక్‌లో అయ్యప్ప ఇరుముడితో పాటు గోవుతో నగరానికి చెందిన బాలకృష్ణ.. చేపట్టిన యాత్ర 6 నెలలకు చేరుకుంది. కార్యక్రమంలో స్థానిక తొర్రూరుని ప్రవీణ్‌కుమార్‌గౌడ్ గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి

షాబాద్: గ్రామాభివృద్ధికి నిరంతరం తన కృషి చేస్తానని మల్లారెడ్డిగూడ మాజీ సర్పంచ్ చందిప్ప జంగయ్య అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని మల్లారెడ్డిగూడలో రూ.5 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ.. గ్రామ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటామన్నారు. సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరారు.


పహాడీషరీఫ్: పిట్టలగూడెంలో రంగులు చల్లుకుంటున్న యువకులు


కందుకూరు: రాచులూరులో.. చిన్నారులు

హోలీ.. ఆనందాల కేళి

హోలీ వేడుకలను శుక్రవారం నియోజకవర్గ ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. చిన్నాపెద్దా తారతమ్యం లేకుండా.. కులమతాలకు అతీతంగా, యువకులు, మహిళలు, ప్రజాప్రతినిధులు, నాయకులు రంగులు పూసుకుని సంతోషంగా గడిపారు. డీజే పాటలతో హోరెత్తించారు. కేరింతలు కొడుతూ సందడి చేశారు. ఈ సందర్భంగా వీధులన్నీ రంగుల రంగవల్లులుగా మారి కనువిందు చేశాయి. ముఖ్యంగా జల్‌పల్లి పిట్టల గూడెంలో సంప్రదాయ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆరాధ్య దైవాలకు పూజలు చేసి సంబురాలు చేసుకున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్


పహాడీషరీఫ్: పిట్టలగూడెంలో అమ్మవారిని కొలుస్తున్న నక్కల పిట్టల తెగ ప్రజలు


కందుకూరు: సాయిరెడ్డిగూడలో..


తుక్కుగూడ: రావిర్యాలలో..


తుక్కుగూడ: మంఖాల్‌లో


బడంగ్‌పేట్: నాదర్‌గుల్ మాతృదేవోభవ అనాథాశ్రమంలో..


మహేశ్వరంలో..

యువత బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలి


ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డితో పోలీస్, మీడియా టీం సభ్యులు

మేడ్చల్‌రూరల్: యువత బెట్టింగులు, ఆన్‌లైన్ గేమ్స్ వంటి వాటికి దూరంగా ఉండాలని మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మేడ్చల్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత ఆన్‌లైన్ గేమ్స్ ఆడి డబ్బులు పోగొట్టుకోవడమే కాకుండా తమ విలువైన ప్రాణాలు తీసుకుంటూ కుటుంబాలకు శోకాన్ని మిగిలిస్తున్నారన్నారు. బెట్టింగులకు పాల్పడవద్దని, ఆన్‌లైన్ గేమ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. శరీర దారుఢ్యానికి, మానసిక వికాసానికి క్రీడలు ఎంతో అవసరమని యువత క్రీడా రంగంలో రాణించాలని ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ అన్నారు. యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు, ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నామన్నారు. ఈ టోర్నీలో 48 జట్లు పాల్గొంటున్నట్లు తెలిపారు. టోర్నీ ప్రారంభం అనంతరం మొదటి మ్యాచ్ మేడ్చల్ పోలీసులు– మీడియా సభ్యుల మధ్య సాగింది. మొదట బ్యాటింగ్ చేసిన పోలీస్ టీం నిర్ణీత 7 ఓవర్లలో 69 పరుగులు చేసింది. భారీ లక్ష్యంతో బరిలో దిగిన మీడియా టీం 7 ఓవర్లలో 67 పరుగులు చేయడంతో 2 పరుగుల తేడాతో పోలీస్ టీం విజయం సాధించింది. ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఎస్ఐ, మీడియా సభ్యుడు రాజశేఖర్‌కు ఏసీపీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు హరినాథ్, నియోజకవర్గ ఉపాధ్యక్షులు మురళీధర్, బారీ, మల్లారెడ్డి, లక్ష్మణ్‌యాదవ్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు మహేశ్, పోలీసులు, యువకులు పాల్గొన్నారు.

పంట పొలాల్లో జంతువుల వ్యర్థాలు

- ఆందోళనలో కర్షకులు
- అధికారులు చర్యలు తీసుకోవాలంటూ వేడుకోలు

దోమ: జంతువుల వ్యర్థాలు పంట పొలాల్లో వేస్తుండడంతో కర్షకులు ఆందోళన చెందుతున్నారు. తమ పంటలు పాడవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమ మండల పరిధిలో పాలేపల్లి గ్రామ సమీపంలోని చెరువు వెనుక భాగంలోని వరి పొలాల్లో కొందరు వ్యక్తులు జంవుతులను చంపి, వాటి వ్యర్థాలను అక్కడే పడేస్తున్నారు. దీంతో కుక్కలు తదితర జంతువులు వాటికోసం వచ్చి పొలాలను పాడుచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు వ్యక్తులు జంతువుల మాంసానికి అలవాటు పడి వాటి వ్యర్థాలను పంట పొలాల్లో పడేస్తున్నారని, దీంతో తమ పంటలు పాడవుతున్నాయని మండిపడుతున్నారు. అటువైపే చెరువు ఉండడంతో జంతువుల వ్యర్థాలను చెరువులో పడేయడంతో చేప పిల్లలు మృత్యువాత పడుతున్నాయని మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు ఈ విషయాన్ని గ్రహించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.


పాలేపల్లిలో వరి పొలాల వద్ద జంతువు వ్యర్థాలు

ప్రశ్నిస్తే.. సస్పెండ్ చేస్తారా?


ఇబ్రహీంపట్నం: సీఎం దిష్టిబొమ్మను దహనం చేసిన బీఆర్ఎస్ శ్రేణులు

- బీఆర్ఎస్ నాయకుల నిరసన
- ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం

ఇబ్రహీంపట్నం: ప్రజా సమస్యలపై ప్రశ్నించిన ప్రతిపక్ష ఎమ్మెల్యేను సస్పెండ్ చేస్తారా అని బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అసెంబ్లీ నుంచి మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం బీఆర్ఎస్ నేతలు ఇబ్రహీంపట్నంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటారని, ఎన్నిసార్లు సస్పెండ్ చేసినా భయపడే ప్రసక్తేలేదని పేర్కొన్నారు. రాబోయే కాలంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగినరీతిలో గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ భరత్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు భరత్ రెడ్డి, రాజు, రాజ్‌కుమార్, శివసాయి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమాధానాలు లేకే..

షాద్‌నగర్: అసెంబ్లీ సమావేశాల నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డిని సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం పట్టణంలో ఆ పార్టీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. అసెంబ్లీలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు అడిగే ప్రశ్నలకు ప్రభుత్వ సమాధానాలు చెప్పలేక సమావేశ మందిరం నుంచి సస్పెండ్ చేయడం సరికాదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదిన్నర పూర్తయినా నేటికీ హామీలు అమలు చేయడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నటరాజన్, నాయ కులు మన్నె కవిత, నారాయణ, లక్ష్మణ్ నాయక్, వీరేశంగుప్తా, వెంకట్రామిరెడ్డి, శేఖర్, శంకర్, సుధీర్, పాపయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్‌లో..

మొయినాబాద్: అసెంబ్లీ సమావేశాల నుంచి మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డిని సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. శుక్రవారం మున్సిపల్ కేంద్రంలో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పోలీసులు ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను చెదరగొట్టారు. కొంత మంది నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నర్సింహగౌడ్, మాజీ సర్పంచ్ నాయకులు రవియాదవ్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మొయినాబాద్: నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు


షాద్‌నగర్: ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న నాయకులు

పోలేపల్లి ఎల్లమ్మ దేవాలయంలో హోమం

దుద్యాల్: మండల పరిధిలోని పోలేపల్లి ఎల్లమ్మ దేవాలయంలో శుక్రవారం హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక హోమం నిర్వహించామన్నారు. ప్రతీ పౌర్ణమి రోజున ప్రత్యేక హోమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. భక్తులు ఎవరైనా పాల్గొనాలనే ఆసక్తి ఉంటే ఒక రోజు ముందుగా తమను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జయరాములు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


హోమం నిర్వహిస్తున్న పండితులు

తండాల్లో ఘనంగా ఓరి పండుగా

దుద్యాల్: తండాల్లో గిరిజనులు ఓరి పండుగను శుక్రవారం వినూత్నంగా నిర్వహించుకున్నారు. సాధారణంగా గ్రామాల్లో హోలీ సందర్భంగా రంగులు చల్లుకుని జరుపుకొంటారు. కానీ తండాల్లో మాత్రం కాముడి దహనం మరుసటి రోజు ఉదయం నుంచి ఓరి పండుగను నిర్వహిస్తారు. తండాల్లో ప్రతీ ఇంటికి మేక మాంసం పంపిణీ చేసుకుని ప్రత్యేక పూజలు చేస్తారు. మండల పరిధిలోని, ముచ్చుకుంటతండా, వాల్యానాయక్‌తండా, రోటిబండతండా, పులిచర్లకుంటతండా, సాగారం తండా, చెట్టుపల్లి, గడ్డమీది తండాల్లో ఈ పండగను నిర్వహించుకున్నారు.

పండుగ ప్రత్యేకత..

నాయక్, కారుబార్ అనే ఇద్దరు ఓరికోసం బాధ్యతలు తీసుకుంటారు. వారితో పాటు తండాకు చెందిన పెద్ద మనుషులు అందరిని కలుపుకొని ఒకే దగ్గర చేరి ఈ ఉత్సవాలను నిర్వహిస్తారు. అందులో భాగంగానే శుక్రవారం ముచ్చుకుంటతండాలో ఓరి పురస్కరించుకుని దాదాపు రూ. 50వేలు వెచ్చించి, మేకలను కోసి తండా వాసులందరికీ మాంసం పంచిపెట్టారు. తండా వాసులు ప్రతిఒక్కరూ కూడా గ్రామంలో ఒక అనువైన ప్రదేశానికి చేరుకుని అక్కడే ఆడ, మగ తేడాలేకుండా అందరు కలిసి కట్టుగా ఈ పండుగను జరుపుకొంటారు. ఈ కార్యక్రమంలో తండా వాసులు రూప్లా నాయక్, వాల్యా నాయక్, కిషన్ నాయక్, చందర్ నాయక్, శంకర్ నాయక్, హీర్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.


ముచ్చుకుంట తండా వేడుకలో పాల్గొన్న గిరిజనులు

పుచ్చ సాగుతో రూ.లక్షల్లో లాభాలు

- మార్కెట్‌లో మంచి డిమాండ్
- పొలం వద్దకే వచ్చి పంట కొనుగోలు
- సాగుకు ఆసక్తి చూపుతున్న రైతులు

చేవెళ్ల: మార్కెట్ డిమాండ్‌తోపాటు కాలానికి అనుగునంగా రైతులు సాగు చేసే పంటలతో మంచి లాభాలు పొందవచ్చునని పుచ్చకాయల సాగు చేస్తున్న రైతులు చెబుతున్నారు. ఇతర రాష్ట్రాల్లో ఎక్కువగా పండే ఈ పుచ్చకాయల సాగు మన ప్రాంత రైతులు సైతం పండిస్తూ మంచి లాభాలు ఆర్జిస్తున్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉండటంతో వ్యాపారులే పొలం వద్దకు వచ్చి పంట కొనుగోలు చేస్తున్నారు. నేరుగా మార్కెట్‌కు తరలించి అమ్ముకునే అవకాశం ఉంది. ప్రస్తుతం వేసవి, రంజాన్ మాసం నేపథ్యంలో పుచ్చకాయలకు భారీ డిమాండ్ కనిపిస్తోంది. మార్కెట్‌లో రైతులకు కిలో రూ.7 నుంచి రూ.10 వరకు పలుకుతోంది. వినియోగదారులకు మాత్రం కిలో రూ.20 చొప్పున అమ్ముతున్నారు.

రూ.లక్షన్నర వరకు ఆదాయం

మండల పరిధిలోని ఆలూరుకు చెందిన తీగ మధుమోహన్‌రెడ్డి నాలుగేళ్లుగా పుచ్చకాయల సాగుతో లాభాలు గడిస్తున్నాడు. ఈ ఏడాది ఎకరంన్నర విస్తీర్ణంలో పుచ్చకాయ సాగు చేశాడు. ఇందుకు రూ.లక్ష ఖర్చు చేస్తే 30 టన్నుల దిగుబడి వచ్చింది. వీటిని విక్రయించి రూ.3లక్షల ఆదాయం సమకూరింది. ఖర్చులు పోను రూ.లక్షన్నరకుపైగా లాభం వచ్చిందని రైతు చెబుతున్నాడు. ఇతర రైతులు సైతం వచ్చి అడిగి సలహాలు, సూచనలు తీసుకుంటున్నారని రైతు వెల్లడించారు. ఇదే గ్రామానికి చెందిన కుమ్మరి కృష్ణ సైతం ఎకరంన్నర పొలంలో కొత్తగా ఈ ఏడాది ఈ పుచ్చసాగు చేపట్టాడు. ఇప్పటికే సగానికి పైగా పెట్టుబడి వచ్చిందని.. వచ్చే దిగుబడితో పెట్టుబడితో పాటు లాభాలు వస్తాయని సంతోషం వ్యక్తం చేశారు.


ఆలూరులో సాగు చేస్తున్న పుచ్చకాయ పంట

సాగు విధానం

- ఎకరా విస్తీర్ణంలో పంట సాగుకు రూ.60వేల నుంచి రూ.80వేల వరకు పెట్టుబడి అవసరం
- ముందుగా పొలం బాగా దున్నుకుని మల్చింగ్ విధానంలో సాగు చేసుకోవాలి.
- ఎకరా పొలంలో ఏడు వేల నుంచి 10వేల వరకు మొక్కలు పడుతాయి.
- డ్రిప్ విధానంలో సాగు చేసుకోవాలి.
- డిసెంబర్, జనవరి, ఫిబ్రవరిలో సాగు చేసుకుంటే మార్కెట్ సమయంలో దిగుబడులు వస్తాయి.
- మొక్కలు నాటిన 60–75 రోజుల్లో కోతకు వస్తాయి.
- పంటకు రోగాలు రాకుండా జాగ్రత్తగా కాపాడుకోవాలి.
- ఎకరా పొలంలో రెండు కోతల్లో 20–30 టన్నుల వరకు దిగుబడి వస్తుంది.

నాలుగేళ్లుగా మంచి దిగుబడి



నాలుగేళ్లుగా పుచ్చ సాగు చేస్తున్నాను. పెట్టుబడులు ఎక్కువ. దిగుబడి తర్వాత మంచి లాభాలు మిగులుతున్నాయి. అందుకే పుచ్చసాగు కొనసాగిస్తున్నా. ఇతర రైతులను సాగు చేసుకోవాలని ప్రోత్సహిస్తున్నా. పంటను జాగ్రత్తగా కాపాడుకుంటే మంచి దిగుబడులతో పాటు లాభాలు వస్తాయి. ఏటా రూ.లక్షన్నరకు పైగా లాభాలు ఆర్జిస్తున్నాను.

– మధుమోహన్‌రెడ్డి, రైతు, ఆలూరు

ఈ ఏడాదే ప్రారంభించా



పుచ్చ సాగుతో మంచి లాభాలు ఉన్నాయని మధుమోహన్‌రెడ్డిని చూసి ఎకరంన్నర పొలంలో సాగు చేపట్టాను. ప్రస్తుతం పంట దిగుబడి వస్తుంది. మొదటి కోత ప్రారంభించాను. పది టన్నులు విక్రయించా. మరోసగం కోతకు ఉంది. మొదటిసారి కావటంతో పెట్టుబడి లక్షకుపైగా అయింది. సగం కోతతో పెట్టుబడిలో సగం వచ్చింది. రెండో కోతలో లాభాలు వచ్చే అవకాశం ఉంది.

– కృష్ణ, రైతు, ఆలూరు

ఉపాధిహామీ పనులపై ఆడిట్

వివరాలు సేకరిస్తున్న అధికారి డేవిడ్

దుద్యాల్: మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో ఉపాధి హామీ పనులకు సంబంధించిన సామజిక తనిఖీ శుక్రవారం ప్రారంభమయింది. 2023–2024 సంవత్సరానికి సంబంధించిన పనులకు తనిఖీలు చేపట్టారు. ఉపాధి హామీ పనుల్లో పాల్గొన్న ప్రతీ కూలీ ఇంటికి వెళ్లి వారి వివరాలను సేకరిస్తున్నారు. వారు పనులకు హాజరయ్యారా? లేదా? వంటి పూర్తి వివరాలను కూలీలను అడిగి తెలుసుకుంటున్నారు. పనులకు హాజరు కాకుండానే కూలి తీసుకున్నారా? అనే కోణంలో వివరాలు నమోదు చేస్తున్నారు. జాబ్ కార్డు ద్వారా పనులు చేసిన రోజులను లెక్కిస్తున్నారు. ఎలాంటి అవకతవకలకు పాల్పడ్డారని తెలిస్తే వారి వివరాలు తమకు అందజేయాలని ఆడిట్ అధికారి కూలీలను కోరుతున్నారు.


కూలీల వివరాలు సేకరిస్తున్న డేవిడ్